క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక



బోయినపల్లి: మండల పవర్‌లూం సంక్షేమ సంఘం (మండల పద్మశాలీ కార్మిక సంఘం) ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా దూస జనార్దన్, ఉపాధ్యక్షుడిగా శ్రీపతి దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీపతి రవీందర్, కోశాధికారిగా తడుక రామానుజం, ప్రచార కార్యదర్శిగా సిరిపురం ఉపేందర్, సంయుక్త కార్యదర్శిగా శ్రీపతి జనార్దన్, సలహాదారుగా మ్యాన రమేశ్, కార్యవర్గ సభ్యులుగా బిల్ల వెంకటస్వామి, నర్సయ్య, భీమనాథుని శ్రీనివాస్, మహేశుని రమేశ్, సిరిపురం పవన్, దూస మల్లేశం, దేవసాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

జగదీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం

ముస్తాబాద్: అసెంబ్లీలో ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యుడు సర్వర్, మెంగని మనోహర్, చెవుల మల్లేశ్, భరత్, అన్వర్, స్వామి, శ్రీను, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పరిచయ సభ



పుస్తకాన్ని పరిచయం చేస్తున్న అతిథులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మంగారపు విష్ణుప్రసాద్ రచించిన 'తెగమురిసే మేక' పుస్తక పరిచయ సభను శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన అఖిలభారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జుకంటి జగన్నాథం మాట్లాడుతూ రచనల ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బుర్క గోపాల్, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీఎఫ్ ఆధ్వర్యంలో కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం జాతీయ అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కంప్యూటర్ విద్యను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. టీడీఎఫ్ మన తెలంగాణ బడిలో కార్యక్రమంలో భాగంగా కంప్యూటర్లను ప్రభుత్వ పాఠశాలలకు అందజేస్తున్నట్లు తెలిపారు. అమెరికా వైస్ ప్రెసిడెంట్ స్వాతి వారి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పోలీస్ అక్క కార్యక్రమంలో భాగంగా మహిళా కానిస్టేబుల్ మంజుల చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈవో రాజిరెడ్డి, డీసీసీ కార్యదర్శి కొండం రాజిరెడ్డి, దినేష్‌రెడ్డి, గడ్డం వాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, అంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీసేవతో గిరి ప్రదక్షిణ చేశారు. ప్రతి పౌర్ణమి రోజు స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తామని ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ మచ్చ శ్రీనివాస్ తెలిపారు. గ్రామ ప్రముఖులు రాపెల్లి ఆనందం లత, గజభీంకార్ రాజన్న, అంకారపు రవీందర్ అనిత, ఆలయ అర్చకులు విష్ణువర్ధన్, భక్తులు పాల్గొన్నారు.

శ్రీగురు చరిత్ర సంక్షిప్త గ్రంథం ఆవిష్కరణ

వేములవాడఅర్బన్: పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ విద్యాసంస్థల అధినేత ఈశ్వరగారి నరహరిశర్మ రచించిన శ్రీ గురు చరిత్ర సంక్షిప్త గ్రంథాన్ని పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యానంద భారతిస్వామి హైదరాబాద్‌లోని పుష్పగిరి పీఠంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పుష్పగిరి సంస్థానం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పానుగంటి చంద్రమౌళి, ప్రభాకర్‌శర్మ, చిదంబరం, రామ్మోహన్, రమణ, భవాని, కరుణ తదితరులు ఉన్నారు.



బోయినపల్లిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



సిరిసిల్లటౌన్: హోలీ వేడుకల్లో జిందం కళ, చక్రపాణి, కాలనీవాసులు



వేములవాడ అర్బన్: నాంపల్లిలో యువకులు



సిరిసిల్లటౌన్: విద్యానగర్‌లో కాలనీవాసులు



చందుర్తి: మల్యాలలో యువకులు

ఉత్సాహంగా హోలీ..

వేములవాడ అర్బన్/ వేములవాడరూరల్/ కోనరావుపేట/ చందుర్తి/ ముస్తాబాద్/ తంగళ్లపల్లి/ ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/గంభీరావుపేట/ఇల్లంతకుంట/ రుద్రంగి/వీర్నపల్లి: జిల్లాలో హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి రాత్రివరకు ఆనందోత్సాహాలతో ఆడారు. ఒకరిపై ఒకరు రంగుల నీళ్లు చల్లుకుంటూ, రంగులు పూసుకుంటూ సంబరాల్లో మునిగితేలారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ పండుగను జరుపుకున్నారు. చిన్నారులు, యువత కేరింతలు కొడుతూ ఆడారు. వీధుల్లో నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు.



సిరిసిల్ల టౌన్: పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో హోలీ సంబరాల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లెం అన్నపూర్ణ, తదితరులు



ఎల్లారెడ్డిపేటలో..



తంగళ్లపల్లిలో ..



గంభీరావుపేట: రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



కోనరావుపేట: బావుసాయిపేటలో..



వీర్నపల్లిలో చిన్నారులు



రుద్రంగిలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



ఇల్లంతకుంటలో యువకులు



ముస్తాబాద్‌లో..

నిధులు లేక నిర్వహణ భారం

- మూడేళ్లు పూర్తవుతున్నా విడుదల కాని నిధులు
- భారంగా రైతు వేదికల నిర్వహణ
- జిల్లాలో 57 రైతు వేదికలు
- అలంకారప్రాయంగా భవనాలు



బండపల్లి రైతువేదిక ముందు పిచ్చి మొక్కలు

చందుర్తి: పంట సాగులో వస్తున్న మార్పులను రైతులకు ఎప్పటికప్పుడు తెలిపేందుకు గత ప్రభుత్వం క్లస్టర్ గ్రామాల్లో రైతు వేదికలు నిర్మించింది. ప్రతీ మంగళవారం మండలకేంద్రంలో రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సాగులో మెలకువలు, నూతన యాజమాన్య పద్ధతులు వివరించాలని ఆదేశాలు జారీచేశారు. రైతువేదిక నిర్వహణకు ప్రభుత్వమే ప్రతీనెలా రూ.9వేలు నిధులు కేటాయిస్తుండగా ప్రారంభించిన ఆరునెలలపాటు నిధులు విడుదల చేసింది. 2022 ఆగస్టు నుంచి ఇప్పటివరకు రైతు వేదిక నిర్వహణకు నిధులు విడుదల చేయకపోవడంతో వ్యవసాయ విస్తీర్ణాధికారులకు (ఏఈవో) లకు భారంగా మారింది. గత మూడేళ్లుగా నిధులు లేక నిర్వహణ పనులు చేపట్టేందుకు ఏఈవోలు ఇబ్బంది పడుతున్నారు.

జిల్లాలో 57 రైతు వేదికలు

జిల్లాలో 57 రైతు వేదికలు నిర్మించారు. గత ప్రభుత్వం పంటల సాగు సమావేశాలను ఏర్పాటు చేసుకునేందుకు రైతు వేదికలను అందుబాటులోకి తెచ్చింది. కానీ నిర్వహణ నిధులను సమకూర్చడంలో విఫలమైందన్న విమర్శలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ రైతువేదికల నిర్వహణపై దృష్టి సారించలేదు. అధికారంలోకి వచ్చిన నుంచి నిధులు మంజూరుచేయక పోవడంతో అలంకారప్రాయంగానే మారుతున్నాయి.

ఏఈవోలపైనే నిర్వహణ భారం

రైతువేదికల నిర్వహణకు నెలలతరబడి నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ భారం ఏఈవోలపైనే పడుతోంది. గతంలో రైతు వేదికల్లో పనిచేసే వారు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో పనులు మానేస్తున్నారు. దీంతో కొన్ని సందర్భాల్లో ఏఈవోలే రైతు వేదికలను శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

నిధులు ఖర్చుకు నిబంధనలు

ప్రతీ రైతువేదిక నిర్వహణ కోసం నెలనెలా రూ.9 వేలు ప్రభుత్వం కేటాయిస్తోంది. ఈ నిధులను ఏఈవో ఖాతాల్లో నాలుగైదు నెలకోకసారి ప్రభుత్వం జమచేస్తోంది. ఈ డబ్బును రైతు వేదికల్లో జరిగే సమావేశాలకు కావాల్సిన స్టేషనరీ, టీ, బిస్కెట్లతో పాటు ఇతర అవసరాలకు వినియోగిస్తారు. నెలకు విడుదల చేసే నిధుల్లో పరిశుభ్రతకు రూ.3వేలు, శిక్షణకు రూ.2, 500, స్టేషనరీకి రూ.వెయ్యి, విద్యుత్ చార్జీలకు రూ.వెయ్యి, మరమ్మతులకు రూ.వెయ్యి, తాగునీరుకు రూ.5,00 ఖర్చు చేసేలా నిబంధనలు అమలుచేసింది.

ప్రభుత్వంపైనే ఆశలు

రైతువేదిక నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం ఆలస్యంగా విడుదల చేస్తుండటంతో నెలసరి వేతనాల నుంచి ఖర్చులు పెట్టారు. కనీసం ఖర్చు చేసిన నిధులు కూడా చేతికందే పరిస్థితి లేకపోవడంతో అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. బకాయిలతో పాటు ప్రస్తుత నిధులను ప్రభుత్వం విడుదల చేస్తే తమ ఇబ్బందులు తీరుతాయని ఏఈవోలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నివేదిక అందించాం



రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం ప్రతీనెల రూ.9వేల నిధులు కేటాయించింది. రైతు వేదికలు ప్రారంభించిన ఆరునెలల పాటు నిధులు విడుదల చేసింది. 2022 ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు నిధులు విడుదల కాలేదు. ప్రతి సమావేశంలో నిధుల విడుదల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ప్రభుత్వానికి నివేదిక అందించాం. త్వరలోనే నిధులు విడుదల అవుతాయి.

– అఫ్జల్ బేగం, జిల్లా వ్యవసాయాధికారి, రాజన్న సిరిసిల్ల

హోలీ నజరానా .. ఫోన్‌పే స్కానర్



బోయినపల్లి: హోలీ పండుగ సంబరాల్లో భాగంగా భక్షీస్ (నజరానా) తీసుకునేవారు సైతం అప్‌డేట్ అవుతున్నారు. మండలకేంద్రంలో శుక్రవారం హోలీ సంబరాలు జరుపుకుని పలువురి వద్ద నుంచి భక్షీస్ తీసుకునే వారు ఫోన్‌పే స్కానర్ పట్టుకొని తిరగడంతో పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు. హోలీ రోజు చేతిలో డబ్బులు లేకున్నా.. సెల్ ఉంటే స్కాన్ చేయండి అని చెప్పడంతో సెల్ వినియోగంతో ఎంత అప్‌డేట్ అయ్యారో అని పలువురు ముక్కున వేలేసుకున్నారు.

రాజన్న సేవలో మంత్రి సతీమణి



స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అర్చకులు

వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్నను మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి పద్మిని శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం ఆశీర్వచనం ఇచ్చి, ప్రసాదాలు అందజేశారు.



చందుర్తి: వ్యవసాయ పనులకు రైతులకు లీజుకు ఇచ్చేందుకు చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి కొనుగోలు చేసిన ట్రాక్టర్ మూలన పడింది. పాలకవర్గ సభ్యులు, సింగిల్‌విండో అధికారులు పట్టించుకోకపోవడంతో తుప్పు పడుతోంది. ఇప్పటికైనా ట్రాక్టర్‌ను రిపేర్ చేయించి లీజుకు ఇవ్వడం, లేదా వేలంద్వారా విక్రయించి వచ్చిన సొమ్మును సంఘంలో జమ చేయాలని సంఘం సభ్యులు (రైతులు) అధికారులను కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : శ్రీవర్ధన్
సీఈవో ఇన్‌చార్జి, చందుర్తి సెల్‌నెం: 9010222969

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

భక్తిశ్రద్ధలతో డోలోత్సవం



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీరుక్మిణివేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి డోలోత్సవం నిర్వహించారు. వసంతోత్సవంలో భాగంగా ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఇది ఏ కార్యాలయం ?

కోనరావుపేట: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి బోర్డును కూడా ఏర్పాటు చేయలేదు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి ప్రతి రోజూ వివిధగ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. కొత్తగా వచ్చేవారు ఇదేమీ కార్యాలయమని ప్రశ్నిస్తున్నారు.



బోర్డులేని కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయం

తీరిన నీటి సమస్య



బోరు నుంచి వస్తున్న నీరు

సిరిసిల్ల: పట్టణంలోని బీవైనగర్ కార్మిక క్షేత్రంలో బోరు చెడిపోయి నీరు రావడం లేదు. చాలా రోజులుగా బోరు మూలన పడడంతో నీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. బోరును రిపేరు చేస్తే.. స్థానికులకు కొంత మేరకు నీటి సమస్య తీరుతుందని మాజీ కౌన్సిలర్ సీమాబేగం, బీఆర్‌ఎస్ నాయకులు అక్రమ్ మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ అధికారులు స్పందించి సిబ్బందిని, మెకానిక్‌ను పంపడంతో బోరు నుంచి మోటారు బయటకు తీసి రిపేర్ చేశారు. దీంతో మూలన పడిన బోరు నుంచి నీరు రావడంతో స్థానికులకు నీటి ఇబ్బందులు తీరాయి.

సీఎం చిత్రపటం దహనం సరికాదు

ఎల్లారెడ్డిపేట: పండుగ రోజు బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎం చిత్రపటాన్ని దహనం చేయడం సమంజసం కాదన్నారు.